సాక్షి
అనంతపురం
ఆదివారం । 20 । ఆగస్టు । 2023



తల్లీబిడ్డకు 'ఎక్స్‌ప్రెస్' సేవ
ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం అయ్యాక సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు 'తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. 8లో



టమాట కిలో రూ.30
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.22 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/23.2°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ బదిలీ



అనంతపురం టౌన్: అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ వెంకటనారాయణ కడప చిట్స్ విభాగానికి బదిలీ అయ్యారు. చిట్స్ విభాగం సబ్ రిజిస్ట్రార్లను యథాస్థానాల్లో కొనసాగాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంకటనారాయణను శనివారం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా రిలీవ్ చేశారు. దీంతో ఆయన కడప చిట్స్ విభాగానికి వెళ్లారు. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ బాధ్యతలను సీనియర్ అసిస్టెంట్ మంజునాథ్‌కు అప్పగించారు.

'గ్రూప్స్' ఉచిత శిక్షణకు నేడు ప్రవేశ పరీక్ష

- అనంతపురంలో 3 పరీక్ష కేంద్రాలు



అనంతపురం రూరల్: గ్రూప్‌-1, గ్రూప్‌-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,008 మంది అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతితో పాటు అనంతపురంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. అనంతపురంలోని ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల, కేఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు కేంద్రాల్లో 1,667 మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. apstdc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

శ్రావణం.. భక్త పరవశం

- హనుమా.. మముగనుమా..
- అంజన్న క్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం
- వైభవంగా తొలి శ్రావణ శనివారం





మురడి, నేమకల్లులో ప్రత్యేక పూజలందుకున్న ఆంజనేయస్వామి



కసాపురంలో శేషవాహనంపై నెట్టికంటి ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం

రాయదుర్గం: శ్రావణమాస తొలి శనివారం జిల్లా అంతటా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశించిపోయారు. ఈ మాసంలో ప్రసిద్ధ మురడి (డీ హీరేహాళ్ మండలం), నేమకల్లు (బొమ్మనహాళ్ మండలం), కసాపురం (గుంతకల్లు మండలం) ఆంజనేయస్వామి ఆలయాలను ఒకేరోజు దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. వేకువజాము నుంచే ఈ మూడు ఆలయాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూలు, తులసి మాలలతో అలంకరించారు. భక్తులు 'హనుమా.. మము గనుమా' అంటూ ప్రదక్షిణలు చేసి ఇష్టదైవానికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం

గుంతకల్లు రూరల్: భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయం పోటెత్తింది. వేకువజామునే అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. స్వర్ణ కవచ, ప్రత్యేక పుష్పాలతో అందంగా అలంకరించి పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి అందంగా అలంకరించారు. ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ ధనుంజయ, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: న్యాయవా సేవా అధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల న్యాయమూర్తులు హాజరయ్యారు. ముఖ్య అతిథి ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయ సేవా అధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవల కేసుల్లో తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందన్నారు. ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ రాజీమార్గంలో పరిష్కారానికి కృషి చేస్తుందని, రాజీ కుదరని పక్షంలో తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉంటుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇరుపక్షాల నడుమ సామరస్యంగా పరిష్కారానికి సమాన అవకాశాలు కల్పిస్తుందన్నారు. అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పు అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖరరెడ్డి, మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యులు ఎస్.హరికృష్ణ ప్రసంగించారు. మున్సిపల్ ఆర్‌జేడీ పీవీవీఎస్ మూర్తి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు, జిల్లా న్యాయమూర్తులు ఎం.శోభారాణి, రాజ్యలక్ష్మి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీనబాబు, సీనియర్ సివిల్ జడ్జిలు నిర్మల, మెజిస్ట్రేట్ సుజిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్..

అన్ని కోర్టుల పరిధిలో సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సమస్య పరిష్కారానికి అధికారులు ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ కోరారు. న్యాయ సేవా సదన్‌లో శనివారం వివిధ శాఖల జిల్లా అధికారులకు లోక్‌అదాలత్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం: వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని క్షయ నివారణ విభాగంలో వివిధ కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెడికల్ ఆఫీసర్, టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్, పీపీఎం కో ఆర్డినేటర్, అకౌంటెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ పోస్టుల దరఖాస్తును అనంతపురం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ లోపు జిల్లా క్షయ నివారణ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతం



యాడికి 19వ వార్డు మెంబర్‌గా ఎన్నికైన మేకల శ్రీరాములుకు డిక్లరేషన్ అందిస్తున్న అధికారులు

- 6 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం

అనంతపురం రూరల్/గార్లదిన్నె: జిల్లాలో పంచాయతీ ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన 33 వార్డు మెంబర్ స్థానాలు, రెండు సర్పంచ్ స్థానాల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాటమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 22 వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11 వార్డు మెంబర్ స్థానాలతో పాటు యల్లనూరు మండలం జంగంపల్లి సర్పంచ్ స్థానానికి ఎన్నికలు అనివార్యమయ్యాయి. శనివారం ఎన్నికలు జరిగాయి. జంగంపల్లి సర్పంచ్‌గా లింగుట్ల కుళ్లాయప్పనాయుడు గెలుపొందారు. 11 వార్డు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 6 చోట్ల గెలుపొందారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గార్లదిన్నె మండలం బూదేడు పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎస్పీ సీఐ జాకీర్ హుస్సేన్, అనంతపురం రూరల్ సీఐ విజయ భాస్కర్‌గౌడ్, గార్లదిన్నె ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.

డీఈఓ సాయిరామ్‌కు గుండెపోటు



డీఈఓ భార్య ఉమాను ఓదారుస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



చికిత్స పొందుతున్న డీఈఓ సాయిరామ్

- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు
- ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆరా



డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ శనివారం గుండెపోటుకు గురయ్యారు. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటికి చేరుకున్నారు. తనకు కడుపు నొప్పిగా ఉందని భార్య ఉమాకు చెప్పి బెడ్‌రూమ్‌లో విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో భార్య పిలిచినా డీఈఓ నుంచి స్పందన లేదు. అప్పటికే ఆయన కోమాలోకి వెళ్లారు. గట్టిగా కేకలు వేయడంతో ఇంటివద్దే ఉన్న ఏపీఓ నారాయణ స్వామి, కంప్యూటర్ ఆపరేటర్ హరికృష్ణ, డ్రైవరు హుటాహుటిన కారులో తీసుకొచ్చి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు ఆస్పత్రికి వచ్చి డీఈఓ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. రోదిస్తున్న భార్య ఉమాను ఓదార్చారు. గుండెకు రక్తం సరఫరా అయ్యే వాల్వ్ బ్లాక్ కావడం, ఊపిరితిత్తుల్లోకి ఆహారం చేరుకోవడంతో కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ వైద్యులకు సూచించారు. డీఈఓ అస్వస్థతకు గురయ్యారనే సమాచారంతో డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయాల సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఆస్పత్రికి తరలివచ్చారు. రాత్రి పొద్దుపోయాక మెరుగైన వైద్యం కోసం డీఈఓను బెంగళూరు ఆస్పత్రికి తరలించారు.

ఉదయమంతా సరదాగా గడిపిన డీఈఓ..

ఉదయం నుంచి డీఈఓ సాయిరామ్ సరదాగా గడిపారు. నగర శివారులోని టీటీడీసీలో జరుగుతున్న రీజనల్‌స్థాయి ప్రధానోపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. గాయకుడైన డీఈఓ ఈ సందర్భంగా 'ఇదే కదా ఇదే కదా నీకథ...ముగింపు లేనిదై సదా సాగదా' అంటూ మహర్షి సినిమాలో పాట పాడి అందరినీ ఆకర్షించారు. అక్కడి నుంచి సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరుకుని ఎంఈఓల సమావేశంలో పాల్గొన్నారు. ఇక్కడి నుంచి 3 గంటల సమయంలో ఇంటికి బయల్దేరారు. కాగా... డీఈఓ గతంలోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. డీఈఓ త్వరగా కోలుకోవాలని విద్యాశాఖ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు.

10 పంటలకు ఉచిత బీమా

- ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్
- తొలిసారిగా ఆముదం పంటకు బీమా



అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి వరుసగా ఐదోసారి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ, మండల, జిల్లా యూనిట్ వారీగా ఒకట్రెండు రోజుల్లో పంటల బీమా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఖరీఫ్‌లో అటు వాతావరణ బీమా, ఇటు ఫసల్ బీమా పథకాల కింద మొత్తం 10 పంటలకు బీమా వర్తింపజేశారు. తొలిసారిగా ఆముదం పంటను బీమా పరిధిలోకి తెచ్చారు. వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు ఇవ్వనున్నారు. వర్షపాతం, వాతావరణ సమాచారం ఆధారంగా బీమా లెక్కించనున్నారు.

- ఇక ఫసల్‌బీమా కింద మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, జిల్లా యూనిట్ కింద రాగి, ఆముదం, గ్రామం యూనిట్ కింద కంది పంటకు బీమా వర్తింపజేసినట్లు సమాచారం. ఇవన్నీ పంట కోత ప్రయోగాలు, వాటి దిగుబడుల ఆధారంగా పరిహారం వర్తింపజేస్తారు. సాగు చేసినట్లు ఈ-క్రాప్ డేటా ఆధారంగా పంటల వారీగా రైతులకు బీమా పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నారు.
- గడిచిన నాలుగేళ్లలో ఉచిత బీమా పథకాల కింద ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 11.21 లక్షల మంది రైతులకు రూ.1,855 కోట్ల పరిహారం జమ చేశారు.

సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం

అనంతపురం టౌన్: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.2.2 కోట్ల చొప్పున అనంతపురం డివిజన్‌లో ఐదు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు రూ.11కోట్ల నిధులను కేటాయించింది. అనంతపురం రూరల్ మండలం కొడిమి, ఉప్పరపల్లి, బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి, నార్పల మండలం దుగుమర్రి, బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాల పనులు చేపడుతున్నారు. ఇప్పటికే కొడిమి, ఉప్పరపల్లి, చెన్నంపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. దుగుమర్రిలో రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేపడుతున్నారు. మరో రెండు నెలల్లో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు అనంతపురం డివిజనల్ ఈఈ రమేష్ తెలిపారు. వీటితోపాటు విద్యుత్ తీగల పునరుద్ధరణ పనులు సైతం వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.

రిమాండ్‌కు ఎస్‌బీఐ పూర్వ మేనేజర్

రాయదుర్గం: ఖాతాదారుల నగదును ఇతరుల ఖాతాలకు మళ్లించిన కేసులో నిందితుడైన రాయదుర్గం ఎస్‌బీఐ పూర్వ మేనేజర్ శ్రీనివాస లక్ష్మీనరసింహ ఫణికుమార్‌ను అర్బన్ పోలీసులు రిమాండ్‌కు పంపించారు. శ్రీనివాస లక్ష్మీనరసింహ ఫణికుమార్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసిన సమయంలో ఖాతాదారులకు సంబంధించిన రూ.1,00,07,323 నగదును ఇతరుల ఖాతాకు మళ్లించారు. దీన్ని గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు ఈ ఏడాది జూన్ 21న అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనపై 409, 420, 468, 471, 477-ఏ ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు శ్రీనివాస లక్ష్మీనరసింహ ఫణికుమార్‌ను శుక్రవారం రాత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరుపరచగా.. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ లక్ష్మన్న తెలిపారు.

అంగరంగ వైభవంగా సామూహిక వివాహాలు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నూతన వధూవరులతో ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మేయర్ వసీం తదితరులు

- లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఒక్కటైన 42 జంటలు
- తాళిబొట్లు, పెళ్లి సామగ్రి అందజేసిన పైలా ఫౌండేషన్
- నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం పది నుంచి పదకొండు గంటల శుభ ముహూర్తంలో 42 జంటలు ఒక్కటయ్యాయి. వధూవరులకు ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పైలా రమాదేవి దంపతులు బంగారు తాళిబొట్లు, పెళ్లి సామగ్రిని అందజేశారు. భోగసముద్రంలోని అల్ట్రాటెక్ సిమెంట్స్ కంపెనీ సహకారంతో ప్రతి జంటకూ ఉచితంగా కుట్టుమిషన్ అందించారు. వివాహ వేడుకలను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు. వేడుకల్లో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథచార్యులు, బాలాజీ స్వామి పాల్గొన్నారు. రాప్తాడు, అనంతపురం, గుంతకల్లు, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డపద్మావతి, ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో తాడిపత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు వీఆర్ రామిరెడ్డి, రమేష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, బీసీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, ఉమ్మడి మధుసూధన్‌రెడ్డి, వెన్నపూస రవీంద్రరెడ్డి, పామిడి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శేషవాహనంపై వీరభద్రస్వామి



విడపనకల్లు: ఉండబండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వీరభద్రస్వామి, కాళికాదేవిలు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ రమేష్‌బాబు, ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు ఆధ్వర్యంలో అర్చకులు ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్, ఆలయ కమిటీ డైరక్టర్లు పెద్ద తిప్పయ్య, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడి సన్నిధిలో శింగనమల ఎమ్మెల్యే




ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులతో ఆలయ పదాధికారులు

పావగడ: తొలి శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా శనీశ్వరుడిని దర్శించుకున్నారు. తైలాభిషేకం నిర్వహించి, నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ మర్యాదలతో నిర్వాహకులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తల్లీబిడ్డకు ఎక్స్‌ప్రెస్ సేవ

- కాన్పు కష్టతరమైన కేసులను ప్రధాన ఆస్పత్రులకు తరలించేలా జగన్ సర్కార్ చర్యలు
- అందుబాటులో వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు
- బాలింతలను ఇళ్లకు తరలించడంతో పాటు కొత్తగా గర్భిణులను ఆస్పత్రికి తరలించేలా చర్యలు
- 24 గంటలూ ఉచిత సేవలందించేలా రూపకల్పన



తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యాలు

అనంతపురం క్రైం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత నిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సేవలను మరింత విస్తృతం చేశారు. ముఖ్యంగా మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హైరిస్క్(కష్టతరమైన) గర్భిణులకు సురక్షిత ప్రసవం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తూ నూతన మార్గదర్శకాలను విడుదల చేశారు.

నిర్దేశిత సమయంలో ఆస్పత్రికి చేర్చేలా

గతంలో డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను కేవలం ప్రసవానంతరం బాలింత, పసికందులను వారి ఇళ్లకు తరలించేందుకు ఉపయోగించేవారు. జిల్లాలో నెలకు సగటున 900 మంది మాతాశిశువులను ఒక్క పైసా ఖర్చు లేకుండా డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా వారి ఇళ్లకు సురక్షితంగా తరలించారు. ఈ క్రమంలో హైరిస్క్ గర్భిణులను సకాలంలో ఆస్పత్రికి చేర్చడంలో 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోతే పరిస్థితి చేయి దాటే ప్రమాదముంది. దీంతో ఈ సమస్యను అధిగమించేలా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా వివిధ పీహెచ్‌సీల పరిధిలో 413 హైరిస్క్ కేసులను వైద్య ఆరోగ్యశాఖాధికారులు గుర్తించారు. ఈ నెలకు సంబంధించి ఇప్పటి వరకూ పురిటి నొప్పులతో 380 మందిని సమీపంలోని జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు 108 అంబులెన్స్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాల ద్వారా తరలించారు.

23 ప్రాంతాల్లో వాహనాల ఏర్పాటు

జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 433 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హైరిస్క్ గర్భిణులను అత్యవసర సమయంలో ఆయా ఆస్పత్రికి తరలించేలా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు జిల్లాలో 24 అందుబాటులో ఉండగా, 23 ప్రాంతాల్లో వాహనాలను సిద్ధంగా ఉంచారు. వీటిలో అనంతపురంలో 13 వాహనాలు ఉండగా, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు ప్రాంతాలకు 2, తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి ప్రాంతాలకు ఒకటి, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాల్, బొమ్మనహాళ్ ప్రాంతాలకు ఒకటి, గుంతకల్లు, వజ్రకరూరుకు ఒకటి, గుత్తి, పామిడికి ఒకటి, పెద్దవడుగూరుకు 1, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి ప్రాంతాలకు ఒకటి, ఉరవకొండ, విడపనకల్లు, కనేకల్లు ప్రాంతాలకు ఒకటి, శింగనమల, నార్పలకు ఒకటి చొప్పున అందుబాటులో ఉంచారు. ఆయా ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు నేరుగా 102 మేనేజర్ బీవీ రమణకు (91777 95918)కు ఫోన్ చేయడం ద్వారా ఈ వాహన సేవలను సమకూరుస్తారు.

పనితీరు మారకపోతే చర్యలు తప్పవు

- టీచర్లకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరిక



కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

కదిరి అర్బన్: 'ప్రభుత్వం విద్యారంగానికి రూ.కోట్లు ఖర్చుపెడుతున్నా మీరు బాధ్యతగా పనిచేయకపోవడంతో అంతా వృథా అవుతోంది. మీ పిల్లలైతే ఇలాగే చేస్తారా?. ఇకనైనా పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు' అంటూ పలువురు ఉపాధ్యాయులను ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. కదిరిలోని వీవర్స్ కాలనీ, కుటాగుళ్లలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బేరిపల్లి సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వీవర్స్ కాలనీ పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల వర్క్ బుక్కుల నిర్వహణ బాగుందని ఉపాధ్యాయురాలు పద్మను అభినందించారు. ప్రాథమిక పాఠశాలను సమీపంలోని ఉన్నత పాఠశాలలో ఎందుకు విలీనం చేయలేదని ఎంఈఓ చెన్నకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలీనం చేసి ఉంటే విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు అందేవి కదా అని పేర్కొన్నారు. అనంతరం కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లి 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ట్యాబ్‌లు పరిశీలించి, సబ్జెక్టుల్లో వెనుకబడి ఉండడం గుర్తించారు. ఈ క్రమంలోనే విద్యార్థులను బయటకు పంపి ఉపాధ్యాయులను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. 'తరగతి గదిలో 40 మంది విద్యార్థులకు మొత్తం రూ.15 లక్షలు విలువ చేసే ట్యాబ్ ప్రభుత్వం అందజేసింది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఇలా పంపిణీ చేయలేదు. ప్రభుత్వం ఇంత చేస్తున్నా మీ బాధ్యతారాహిత్యంతో చెడ్డపేరు వస్తోంది. వారంలోపు పనితీరు మార్చుకోకపోతే రిమూవ్ చేస్తాను'అని హెచ్చరించారు. అక్కడి నుంచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు వెళ్లిన ఆయన ఇంగ్లిష్ వర్క్‌బుక్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్యాపకురాలు లక్ష్మి, ప్రిన్సిపాల్ దామోదర్‌ను మందలించారు. ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా శిక్షణ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం బేరిపల్లి సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి, డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలి

- గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్



అనంతపురంలో ఓటరు సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

రాప్తాడు రూరల్/అనంతపురం క్రైం: స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2024లో భాగంగా ఇంటింటా ఓటరు సర్వే పక్కాగా చేపట్టి గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శనివారం అనంతపురంలో ఆదిమూర్తి నగర్‌లోని 127 పోలింగ్ స్టేషన్, అరవింద నగర్‌లోని 133 పీఎస్, రూరల్ మండల పరిధిలోని పాపంపేట 77, 78 పీఎస్‌ల పరిధిలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వస్తున్నారా, ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయా... లేవా, మీ ఓటు ఎక్కడ ఉంది... పోలీస్ స్టేషన్ ఎంత దూరంలో ఉంది... తదితర వివరాలను కలెక్టర్ ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ గడువులోగా పూర్తి చేయాలన్నారు. రోజూ బీఎల్‌ఓలు ఇంటింటా పరిశీలన షెడ్యూల్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు అందజేయాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లను కూడా సర్వేలో పాల్గొనేలా చూడాలన్నారు. బీఎల్‌ఏలకు సందేహాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. డోర్ నంబర్ల సమస్యలు ఉన్న వాటికి నోషనల్ నంబర్లు ఇచ్చేటప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ నంబర్లు లేని వాటికి నంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. వీలైనంత మేరకు కుటుంబమంతా ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూసుకోవాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత బీఎల్‌ఓ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ బాబు, బీఎల్‌ఓలు సౌభాగ్యలక్ష్మి, గీత, సుభాషిణి, దివ్యవాణి, బీఎల్‌ఏలు ఉన్నారు.

అప్పగించిన పనులు సక్రమంగా చేయండి

రాప్తాడు రూరల్: పై అధికారులు అప్పగించిన పనులను క్షేత్రస్థాయిలో సక్రంగా చేయాలని సమగ్ర శిక్ష ఏపీసీ, డీఈఓ ఎం.సాయిరామ్ హెచ్చరించారు. శనివారం సమగ్రశిక్ష కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారుల(ఎంఈఓల)తో సమావేశం ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మన బడి నాడు–నేడు' పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. రెండో విడత పాఠశాలల్లో జరుగుతున్న పనులను గడువులోగా పూర్తి చేసేలా చూడాలన్నారు. ఫర్నీచర్, పెయింటింగ్, రూఫ్ పనులు, ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్రస్థాయి నుంచే వస్తున్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఇస్తున్న నివేదిక ఆధారంగానే ఆయా పనులు చేసేందుకు వస్తున్నారన్నారు. ఈ క్రమంలో పెయింట్ కార్మికులు వస్తే ఇంకా పనులు పెండింగ్ ఉన్నాయంటూ కొందరు హెచ్ఎంలు వెనక్కు పంపారన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చారా.. అలసత్వంగా ఉండే హెచ్ఎంలకు చార్జెస్ ఫ్రేమ్ చేస్తామని హెచ్చరించారు. పెయింటర్లు మళ్లీ రావాలంటే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆ ఖర్చులు హెచ్ఎంల తోనే రికవరీ చేస్తామన్నారు. కేవలం హెచ్ఎంలు ఇచ్చే రిపోర్ట్‌లపైనే ఆధారపడకుండా ఎంఈఓలు కూడా తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. నాడు–నేడు పనుల్లో ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేదే లేదన్నారు.

హైవే రెస్టారెంట్ల నిర్వాహకులకు నోటీసులు జారీ

అనంతపురం క్రైం: నగర శివారులోని రుద్రంపేట బైపాస్ నుంచి బెంగళూరుకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన రెస్టారెంట్ల నిర్వాహకుల నిబంధనలకు తిలోదకాలిచ్చారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఈ అంశం వెలుగు చూసింది. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాలతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కళ్యాణ్ చక్రవర్తి బృందం శనివారం ఉదయం పలు రెస్టారెంట్లపై ఆకస్మిక దాడులు చేపట్టింది. స్పైస్ గార్డెన్ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన తిండిని ఫ్రీజర్లలో భద్రపరిచి ఆహార ప్రియులకు అందజేస్తున్నట్లుగా గుర్తించారు. అలాగే వివాహ భోజనంబు రెస్టారెంట్‌లో కిచెన్ ఫ్లోర్, మురుగు నీటిపారుదల వ్యవస్థ, ఇతర వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేనట్లుగా నిర్ధారించుకున్నారు. ఉలవచారు రెస్టారెంట్‌లో శుచి, శుభ్రత పాటించకుండా ఆహార పదార్థాలు అమ్మకాలు సాగిస్తున్నట్లుగా గుర్తించారు. నిర్వహణ సక్రమంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంటూ నోటీసులు జారీ చేశారు. నటీ హెవెన్ కాన్సెప్ట్ రెస్టారెంట్ నిర్వాహకులకు శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతపై పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ తస్లీం, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ మనోజ్, ఏఎస్ఐ బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియో ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు నాగముని

గార్లదిన్నె: స్కార్పియో వాహనం ఢీకొన్న ఘటనలో జాతీయ రహదారి దాటుతున్న ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ముంటిమడుగు కొత్తపల్లికి చెందిన అల్లు నాగముని (80) శనివారం ఉదయం కల్లూరులో కాయగూరలు కొనుగోలు చేసి, స్వగ్రామానికి ఆటోలో బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిపై ముంటిమడుగు కొత్తపల్లి క్రాస్ వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతున్న సమయంలో కల్లూరు వైపు నుంచి అనంతపురం వైపుగా వేగంగా వెళుతున్న స్కార్పియో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగముని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

శెట్టూరు: మండలంలోని చౌళూరులో వివాహితపై అత్యాచార యత్నం చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శుక్రవారం చౌళూరులో ఓ వివాహిత గొర్రెల మంద వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన గొల్ల కృష్ణమూర్తి అత్యాచారానికి ప్రయత్నించాడు. తీవ్రంగా ప్రతిఘటించి, కృష్ణమూర్తి బారి నుంచి బయటపడిన బాధితురాలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న కృష్ణమూర్తిని అయ్యగార్లపల్లి బస్టాండ్ వద్ద శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు ఉమేష్

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని చౌడమ్మ గుడి ప్రాంతంలో నివాసముంటున్న రామాంజనేయులు కుమారుడు వగ్గా ఉమేష్ (28) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే వ్యసనాలకు బానిసయ్యాడు. తన వ్యసనాలు తీర్చేకునేందుకు జీతం డబ్బులు తక్కువ పడేవి. దీంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేసేవాడు. అప్పులు తీర్చలేక ముఖం చాటేస్తుండడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి సమాచారం అందుకున్న తండ్రి కుమారుడిని మందలించేవాడు. పలుమార్లు కుమారుడి అప్పులు తీరుస్తూ వచ్చాడు. అయినా తన ప్రవర్తన మార్చుకోని శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి రాయదుర్గానికి వచ్చాడు. ఆ సమయంలో అప్పుల గురించి తండ్రి ఆరా తీసి, మందలించాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఉమేష్.. శనివారం మధ్యాహ్నం ఇంట్లోనే తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి హెచ్చెల్సీకి 1800 క్యూసెక్కుల నీరు



హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి

కణేకల్లు: హెచ్చెల్సీకి ఆదివారం నుంచి 1,800 క్యూసెక్కుల నీరు రానున్నట్లు కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జూలై 31న హెచ్చెల్సీకి నీటి విడుదల మొదలైందన్నారు. కొన్ని రోజుల పాటు 500 క్యూసెక్కుల నీరు డ్రా చేసుకున్నట్లు చెప్పారు. వంద క్యూసెక్కుల చొప్పున పెంచుకొంటూ 1,500 క్యూసెక్కులు తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి 1,800 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తుంగభద్ర బోర్డుకు ఇండెంట్ ఇచ్చారన్నారు. ఈ మేరకు బోర్డు అధికారులు ఆంధ్రా సరిహద్దులో నేడు నీరు వదలనున్నట్లు డీఈఈ తెలిపారు. ప్రస్తుతం హెచ్చెల్సీకి వస్తున్న నీరు ఎంపీఆర్, పీఏబీఆర్, జీబీసీకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి



గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా గుత్తికి చెందిన వై.రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ స్థానంలో కొనసాగుతున్న వై.సందీప్‌రెడ్డి తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారున. దీంతో పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. కాగా, రాజశేఖరరెడ్డి గుత్తి మండలం బసినేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండల సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి కుమారుడు. రాయలసీమ విమోచన సమితి, గుంతకల్లు రైల్వే జోన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పని చేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

బుక్కరాయసముద్రం: మండలంలోని దండువారిపల్లిలో దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం దండువారిపల్లి గ్రామానికి చెందిన రవికుమార్, తన భార్య తేజతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరూ తీవ్ర స్థాయిలో గొడవపడి క్రిమి సంహారక మందు తాగారు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఇద్దరినీ అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: మండలంలోని దండువారిపల్లికి చెందిన నరేష్ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు తెలిపారు. భార్య జ్యోతి, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న నరేష్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. దీంతో విసుగు చెందిన జ్యోతి ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. పలు దఫాలుగా ఆమెను బతిమలాడి కాపురానికి రావాలని భర్త ప్రాధేయపడ్డాడు. అయినా ఆమె వినకపోవడంతో మనస్తాపం చెందిన నరేష్.. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మూర్ఛతో పెయింటర్ మృతి



మృతిచెందిన సుబ్బరాయుడు

ధర్మవరం అర్బన్: మూర్ఛ వ్యాధితో ఓ పెయింటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన సుబ్బరాయుడు ధర్మవరంలోని శారదానగర్‌లో ఒంటరిగా నివాసముంటూ పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి ఎదుట అరుగుపై కూర్చొని ఉండగా మూర్ఛ రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని పోలీసులు కోరారు.

కురుబ సంఘం ఎన్నికల కమిటీ చైర్మన్ల ఎన్నిక

అనంతపురం రూరల్: కురుబ సంఘం ఎన్నికల కమిటీ చైర్మన్లను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కురుబ సంఘం ఎన్నికల కమిటీ రాష్ట్ర చైర్మన్ బిల్లే ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా లెక్చరర్ నారాయణ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా శివానందతో పాటు రాయలసీమ జిల్లాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కురుబ సంఘం రాష్ట్ర, జిల్లాల అధ్యక్షుల పదవీ కాలం ముగియడంతో త్వరలో సంఘం కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా చైర్మన్లను ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, బిల్లే శివబాల, కొనకొండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన ప్రారంభం


ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సనప మాధవరాజుల స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉరుములు, మంగళవాయిద్యాలతో గ్రామ సర్వదేవత, గోపూజ, మహా గణపతి, హోమాలు నిర్వహించారు. ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించి, సోమవారం స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పనిచేస్తున్న సీటీస్కాన్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్‌కు మరమ్మతులు చేశారు. శనివారం యధావిధిగా స్కాన్‌లు కొనసాగాయి. స్కాన్ రిపేరీ ఉన్న రోజుల్లో రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి


రైతులకు వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎకాలజీ సెంటర్ సిబ్బంది

ఆత్మకూరు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించొచ్చని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సిబ్బంది మురళీకృష్ణ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ముట్టాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఏ పంటలకు సంబంధించి ఏ మందులు, ఎంత మోతాదులో ఉపయోగిస్తే పంట దిగుబడితో పాటు లాభాలు వస్తాయన్న విషయాలను స్పష్టంగా తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ శంకర్, ఎఫ్‌పీఓ మేనేజర్ ప్రతాప్, సీబీఓ అసోసియేట్ చౌడయ్య, ఎస్‌టీఓ సబిహా, దేవిక, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి పక్కాగా జరగాలి

అనంతపురం క్రైం: నీటిని శుద్ధి చేయడంలో జాప్యం చేయరాదని, పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. శనివారం ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్‌ను మేయర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఫిల్టర్ బెడ్స్ శుద్ధి చేయాలన్నారు. ఆలం, క్లోరినేషన్ సమతుల్యంగా మిక్స్ చేయాలన్నారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు ఇస్సాక్, శ్రీనివాసులు, తదితరులున్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్


గర్భిణుల హెల్త్ కార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఎ డాక్టర్ యుగంధర్

రాప్తాడు: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలను సక్రమంగా అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని బొమ్మేపర్తి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న గర్భిణులకు వైద్య పరీక్షలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అందించే ఆరోగ్య సేవల గురించి సిబ్బందికి, ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మీనా, ఏఎన్ఎం శ్రీలత, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


మంటల్లో కాలిపోతున్న కారు

కనగానపల్లి: అగ్ని ప్రమాదానికి గురైన కారులో నుంచి బయటకు దూకి ఓ వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రహదారిపైనే బోల్తా పడింది. అదే సందర్భంలో కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, కారు కాలిపోయింది. అయితే కారు నడుపుతున్న వాహన యజమాని నారాయణ స్వామి వెంటనే అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకి స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రహదారిపై వెళ్తున్న వారు స్థానికులు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో కారు మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ సమయంలో జాతీయ రహదారి వెళ్తున్న వాహనాలు ఒక వైపు ఆగిపోవటంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. హైవే సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.


ఆర్ఎఫ్ రోడ్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతమాచరిస్తున్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు

అనంతపురం కల్చరల్: శ్రావణమాసంలో వచ్చిన తొలి శనివారం వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శారదానగర్‌లోని శృంగేరీ శంకర మఠం, హౌసింగ్‌బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్ఎఫ్‌రోడ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతం నేత్రపర్వంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు ఏకరూప వస్త్రధారణతో వ్రతం ఆచరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. శివబాలయోగి ఆశ్రమంలో శ్రీవారి లడ్డూపడి పూజలు జరిగాయి. కోర్టురోడ్డు, మారుతీనగర్, ఇందిరానగర్, నాల్గోరోడ్డు తదితర చోట్ల ఆంజనేయస్వామి ఆలయాలలో తొలి శ్రావణ శనివారం పూజలు పెద్ద ఎత్తున జరిగాయి.

నాగుల చవితికి ఏర్పాట్లు


నాగజ్యోతి స్వరూపులు కరణం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నాగుల నగరోత్సవం భారీగా నిర్వహించనున్నారు.

అనంతపురం కల్చరల్: భగవంతుడికి ప్రీతికరమైన శ్రావణమాసం నాగులచవితి రూపంలో తొలి పండుగను తెచ్చింది. ఆదివారం నాగుల చవితి పర్వదినాన్ని, సోమవారం నాగపంచమి వేడుకలను జిల్లా అంతటా వైభవంగా నిర్వహించడానికి పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి శ్రావణమాసం తొలి చవితిని 'నాగుల చవితి'గా, మరుసటి దినాన్ని 'నాగపంచమి'గా జరుపుకోవడం ఆనవాయితీ. ఆర్ఎఫ్ రోడ్ నందున్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, పీటీసీ వద్ద ఉన్న పుట్ట దగ్గర ,లక్ష్మీనగర్ వద్దనున్న నాగుల కట్ట వద్ద శ్రావణమాసం ప్రారంభం కాగానే భక్తుల సందడి పెరిగింది.

నేడు ప్రాచీన కళారూపాల ప్రదర్శన: నగరానికి చెందిన నాగజ్యోతి స్వరూపులు కరణం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నాగుల నగరోత్సవం భారీగా నిర్వహించనున్నారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయి. సాయంత్రం సామూహిక లలితా సహస్రనామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, నాగదేవతల పూజలు ఘనంగా జరుగుతాయి.

మాతృభూమి కోసం జీవిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుంటూ జీవితంలోని ప్రతి రోజూ, ప్రతిక్షణం మాతృభూమి కోసం జీవించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 'నా భూమి-నా దేశం' (నియోజకవర్గ స్థాయి) నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటి వాటికి నీరు పోసి, పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావులు, స్వాతంత్య్ర సమర యోధులను స్మరించుకునేందుకు ఈ ఆజాదీ కా అమృత మహోత్సవ్ ఉత్సవాలను నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. పిడికిలి మట్టితో గాని, మట్టి దీపంతో గానీ పంచ్ ప్రాణ్ ప్రతిష్ఠ చేసి 75 చెట్లతో అమృత వాటికను సృష్టిస్తూ దేశం కోసం పోరాడే వీరులను, స్వాతంత్య్ర యోధులను వారి కుటుంబాలను గౌరవించుకుంటామని వివరించారు. దేశ భక్తిని చాటే ఇలాంటి కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. స్వచ్ఛ మైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దామన్నారు. పుడమి తల్లిని కాపాడుకుందామన్నారు. ఆరు మండలాల్లో సేకరించి మట్టిని ఢిల్లీలో జరిగే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాలకు పంపుతామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా ఆరోగ్యానికి, విద్య, ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేశారని తెలిపారు. నిజాయతీగా బతుకుదాం, బలహీనుల పక్షాన నిలబడుదాం, రాష్ట్రంలో బలహీనులు లేకుండా చేయాలనే పెద్ద సంకల్పంతో పోరాడుతున్న ముఖ్యమంత్రిని బలపరుద్దామన్నారు. మానవ మనుగడ అత్యంత కీలకమైన మట్టిని రక్షించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఎంపీడీఓ సాల్మన్, మేకలు, గొర్రెలు సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ సమస్యలు పరిష్కరించండి


డీఏఓకు సమస్యలు వివరిస్తున్న ఆర్‌బీకే అసిస్టెంట్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ-క్రాప్ నమోదులో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని ఆర్‌బీకే అసిస్టెంట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మను శనివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. ఆర్‌బీకే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నరేష్‌కుమార్, నరసింహ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టోత్తర శత కళశాభిషేకం

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని శ్రీ సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి ఆదివారం నాగులచవితి సందర్భంగా ఆలయంలో అష్టోత్తర శత కళశాభిషేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, రాహు కేతు హోమాలు నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లుగా వెంకటరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసింది.

అభివృద్ధి ఓర్వలేక విమర్శలు

- చంద్రబాబుపై మేయర్ వసీం ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఓర్వలేక విమర్శలు చేయడం సరికాదని మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు 14 మార్కులు వేస్తామని చెప్పడాన్ని మేయర్ ఖండించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారన్నారు. ప్రతిపక్ష హోదాలో జగనన్న సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టాలను తెలుసుకుని, అధికారంలోకి రాగానే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

కార్పొరేట్ స్థాయిలో సేవలు ..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో సమూలమార్పులు తెచ్చి పేదలకు కార్పొరేట్ తరహాలో సేవలందించేలా చర్యలు తీసుకున్నారని మేయర్ అన్నారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలున్నాయా..అని తెలుసుకొని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలతో ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజల వద్దకు పంపుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలుపై ప్రజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అపారమైన విశ్వాసం పెరిగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ సీఎంను లక్ష్యంగా చేసుకుని ప్రజలు తప్పుదోవపట్టించేలా విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్ బాలాంజనేయులు, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశమైన డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలతో కలిసి రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వర్షాభావం నడుమ ప్రధాన పంట వేరుశనగ 52 శాతానికే పరిమితమైందని, దాని స్థానంలో కంది, ఆముదం, మొక్కజొన్న పెరిగినందున సస్యరక్షణ పద్ధతులు తెలియజేయాలన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు, శాస్త్రవేత్తలతో సమావేశమై ఖరీఫ్ స్థితిగతులు, ప్రత్యామ్నాయ సాగు గురించి చర్చించారు. వర్షాభావంతో బట్ట ఏర్పడినందున 5 గ్రాములు పొటాషియం నైట్రేట్ లేదా 5 గ్రాములు 19-19-19 లేదా ఒక శాతం యూరియా లీటరు నీటికి కలిపి రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే బాగుంటుందన్నారు. కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలకు ఆశించిన పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఈ నెల 31న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థలోని నూతన భవనంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను కమిషనర్ విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 27 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు నగరపాలక సంస్థలోని కార్యదర్శి చాంబర్‌లో నామినేషన్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 27న నామినేషన్ పత్రాల ప్రచురిస్తామని, 28న నామినేషన్ పత్రాల పరిశీలన, అదేరోజున సాయంత్రం 4 గంటలకు వ్యాలిడ్ నామినేషన్ పత్రాల ప్రచురణ చేస్తామన్నారు. ఈనెల 29న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజున సాయంత్రం 4 గంటలకు బరిలో ఉన్న ఐదుగురి అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ నెల 31న నగరపాలక సంస్థలోని నూతన భవనంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. అదే రోజున ఓట్లు లెక్కించి, సాయంత్రం 4 గంటల తర్వాత గెలుపొందిన ఐదుగురి పేర్లను ప్రకటించనున్నట్లు తెలిపారు.

అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి

రాప్తాడు: అనంత జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రామినేపల్లిలో కాటమయ్య అనే రైతు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాలు రాక పంటలు సాగు చేయక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఈ ఏడాది తీవ్రమైన వర్షపాతం లోటు ఏర్పడిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.31 లక్షల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు కావాల్సి ఉండగా, కేవలం లక్షా 16 వేల హెక్టార్లలో మాత్రమే సాగు అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోతులయ్య, రైతులు లింగన్న, నారాయణ, కొండా రెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గార్లదిన్నె: బూదేడులో శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ నిర్వహించారు. హోమం అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానంచేశారు.

వ్యక్తికి గాయాలు


గుత్తి రూరల్: యంగన్నపల్లి గ్రామ శివారులో శనివారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించే ధర్మాపురం గ్రామానికి చెందిన కృష్ణమూర్తి పని నిమిత్తం బైక్‌పై బేతాపల్లికి బయలుదేరాడు. యంగన్నపల్లి శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అభాగ్యులకు 'అమ్మ' చే'ఊతం'


కృత్రిమ కాళ్లు అందిస్తున్న 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ఇద్దరు అభాగ్యులకు 'అమ్మ'సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చే'ఊతం'గా నిలిచారు. జిల్లా కేంద్రంలోని బొజ్జన్న, నాయుడు అనే ఇద్దరు వ్యక్తులూ కాళ్లు పోగొట్టుకొని దివ్యాంగులుగా మారారు. బొజ్జన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, కాలు తీసేయాల్సి వచ్చింది. అదేవిధంగా నాయుడు సుగర్ అధికం ఎక్కువగా ఉండడంతో కాలు తీసేయాలని వైద్యులు సూచించారు. దీంతో ఇద్దరికి కుటుంబపోషణ భారంగా మారింది. 'అమ్మ' సంస్థ రమణారెడ్డిని బాధితులు ఆశ్రయించగా, ఆయన స్పందించారు. రూ.60 వేలు విలువ చేసే కృత్రిమ కాళ్లను శనివారం అందించారు. అమ్మసంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులుగా మారిన ఇద్దరికీ కృత్రిమ కాళ్లతో పాటు మందులు కూడా అందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ వారికి సాయం అందిస్తామని భరోసా కల్పించారు.

నేడు 'ఎర్రసితార' పుస్తకావిష్కరణ



ఆదివారం ఆవిష్కరించనున్న 'ఎర్రసితార' స్వర్ణోత్సవ సంచిక

అనంతపురం కల్చరల్: కొండపల్లి సీతారామయ్య, గద్దర్, శ్రీశ్రీ , తరిమెల నాగిరెడ్డి, బండయ్య మాస్టర్, కంచె ఐలయ్య, వైఎస్సార్ , భూమన్ తదితర నాయకుల సభలను తన గళంతో ఉర్రూతలూగించిన జిల్లా కళాకారుడు దాసరి ఆదినారాయణ జీవితంలోని జ్ఞాపకాలకు అక్షరరూపం ఇచ్చిన 'ఎర్రసితార' పుస్తకం ఆదివారం ఆవిష్కరించనున్నారు. మహాబోధి సాహిత్య వేదిక దాసన్నగారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దాసరి ఆదినారాయణ అరుదైన పాటలు, జీవిత ఘట్టాలు, ప్రముఖుల ముందు మాటలతో తోట నాగరాజు అక్షరబద్ధం చేసిన 'ఎర్రసితార' ఆదినారాయణ సాంస్కృతిక స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుర్రం జాషువా స్మారక కళాపరిషత్తు అంతర్జాతీయ చైర్మన్ పెద్దిటి యోహాను, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సాహితీ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు మహాబోధి, కుళ్లాయప్ప కోరారు.

కోదండరామాలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న అతిపురాతన కోదండరామ స్వామి ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ధర్మకర్తలుగా కె.మురళీధర్, ఎం.లక్ష్మీకాంతమ్మ, బీటీ.లక్ష్మీదేవి, వై.శరణబసిరెడ్డి, పి.హారిక, ఎం.మల్లికార్జునయ్య, కె.లక్ష్మీ, ఎక్స్అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు ఏపీ.రాజేంద్రశర్మను నియమించారు. రెండేళ్ల పాటు వీరు ధర్మకర్తలుగా కొనసాగనున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణం, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎన్నిక జరుగుతుందని సభ్యులు శనివారం తెలిపారు.

అశ్వత్థంలో వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో శనివారం టెంకాయల విక్రయం హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. జూటూరు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి రూ.4.50 లక్షలకు టెంకాయల విక్రయ హక్కును దక్కించుకున్నట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.